# కథ

**“నీ భార్య చాలా అందంగా వుంది. ఉద్యోగం కూడా చేస్తుందన్నావుగా. జాగ్రత్త సుమా! భార్యా రూపవతీ శత్రుః” అంటూ పెళ్ళివాళ్ళు టీ టైములో పెట్టిన స్వీట్లు తినేస్తూ వాగుతున్నాడు రామనాథం.**

# బీజం

అప్పుడే పురుగు బుర్రలోకి ఎక్కినట్లుగా శేషు మొహం ఎర్రగా తయారైంది. “నువ్వేం ఫీలయిపోకు, కొత్త మన కంట్రోలు స్ట్రాంగ్‌గా ఉందనుకో ఏం జరగదులే! ప్రతివాడి కళ్ళు బయటికి వెళ్ళే ఆడవాళ్ళమీదే. వీళ్ళు కొంచెం ఆకర్షణలో చిక్కుకున్నారనుకో మన కొంప కొల్లేరయిపోతుంది. అందులో మీ ఆవిడ బ్యాంక్ ఉద్యోగిని. పబ్లిక్‌తో బాగా టచ్ వుంటుంది. నీ జాగ్రత్తలో నువ్వుంటే ఏం కాదులే” అంటూ నవ్వాడు రామనాథం.

“అరేయ్! అలా అనేసి వెళ్ళిపోతే ఎలా? ఆ జాగ్రత్తలు ఏంటో చెప్పు” అంటూ ఆపాడు శేషు.

“అప్పుడప్పుడు చెయ్యి ఝుళిపిస్తే సరి. వాళ్ళే దారిలో వుంటారు” అంటూ వెళ్ళిపోయాడు రామనాథం.

శేషు, రమ్యల కాపురం బాగానే వుంది కానీ, శేషు మనసులో అనుమానం అప్పుడప్పుడు మాటల రూపంలో ముల్లులా గుచ్చుకొంటూ వుండేది రమ్యకు. ఆఫీసు నుంచి అలసిపోయి వస్తే, “ఏం చేసి అలసిపోయావు?” అన్నట్టు మాటాడతాడు. ఉత్సాహంగా వస్తే “అందమైన దానివి కదా! నీతో ఎవడు పనిచేయిస్తాడు?” అని ఎగాదిగా చూస్తాడు.

ఏమిటో ఇతని మనస్తత్వం అనుకుంటూ రాజీపడుతోంది రమ్య.

అందం, చదువు, ఉద్యోగం అన్నీ వుండి పెళ్ళిచూపుల పరీక్షలో మొదటిసారే నెగ్గి, ఉన్న ఊళ్ళో సంబంధం, అందరితో కలసిమెలిసి ఉండవచ్చు అని అనుకుంటూంటే ఇతని దృక్పథంలో ఏదో తేడా కనిపిస్తోంది. తన భార్య అనే సొంత భావనతో నా గురించి మాత్రమే ఇలా ఆలోచిస్తాడా? లేక అందరి ఆడవాళ్ళ గురించి ఇలాగే ఊహించుకుంటాడా? అని మథనపడుతూ, కాలం ఇతనిలో మార్పు తెస్తుందిలే అని ఆశిస్తూ నీరసపడిన మనసుని సముదాయించింది.

“అయ్యో! ఈరోజు బాగా లేటయిందండీ. క్యాష్ బాలెన్స్ కుదరలేదు” అంటూ సంజాయిషీ చెబుతూ లోపలికి వచ్చిన రమ్యవైపు తేరిపార చూశాడు శేషు. అలసి ఆఫీసు నుండి వచ్చిన రమ్యలో ఏదో ఆకర్షణ కనబడి మనసు ఉక్రోషంతో మండిపోయింది.

“ఏం ఒళ్ళు దగ్గర పెట్టుకొని పని చేయట్లేదా? వాడివైపు, వీడివైపు దొంగచూపులు చూడడం మానేస్తే పని సరిగ్గానే సాగుతుంది” అంటూ విరుచుకుపడ్డాడు శేషు.

“ఛ ఛ! ఏం మాటలండీ అవి. బయటికి వెళ్ళే ఆడవాళ్ళందరికీ ఎవరో ఒకరితో సంబంధాలు అంటగడితే ఎలా? మీరూ ఒక ఆడపిల్ల తండ్రి అయ్యారు, ఇప్పుడైనా కనీసం మమ్మల్ని గౌరవంగా చూడడం నేర్చుకోండి” అంటూ క్రష్ నుంచి తీసుకొచ్చిన పాపని క్రిందకు దింపడానికి వంగింది రమ్య.

“ఏం కూశావ్! నీకు, నా కూతురికి పోలికా? నా కూతురు నిప్పు. నా రక్తం పంచుకు పుట్టింది. అయినా నీకు మాటలు బాగా మీరాయ్” అంటూ వంగిన రమ్య వీపుమీద రెండు దెబ్బలు వేసి, బయటకి నడిచాడు శేషు.

అర్ధరాత్రి దాకా బార్‌లో తాగిగాని ఇంటికి చేరలేదు శేషు. అలాంటి రాత్రుళ్ళు ఎన్నో అలవాటయ్యాయి రమ్యకు.

ఎంతో హాయిగా, ఇద్దరి సంపాదనతో, బాదరబందీ లేకుండా గడపవలసిన జీవితం ఇంత వ్యథాభరితంగా తయారవుతుందని ఆశించని రమ్య లోలోపల రోదిస్తూ రోజులు వెళ్ళదీస్తోంది. ఉద్యోగం మానడం వలన ఈమాత్రం ఆధారం కూడా వుండదని ఆ పని చేయకుండా అతికష్టం మీద గడుపుకొస్తోంది.

శేషు తాగుడు ఇంకా ఎక్కువైంది. తద్వారా రమ్యను హింసించడం కూడా ఎక్కువైంది. ఈ పరిస్థితులలో మరో బిడ్డకు కూడా తల్లయింది రమ్య. ఈసారి మగబిడ్డ అవడంతో ‘తన్నేవాళ్ళు, తన్నించుకునేవాళ్ళు ఇద్దరూ పుట్టారు నా ఖర్మ! ఇంతే చాలు. ఇకనైనా జాగ్రత్తపడాలి. వీళ్ళని సవ్యంగా పెంచగలిగితే చాలు’ అనుకుంటూ రోజులు వెళ్ళదీస్తోంది.

ఈ చిరాకులతో చిక్కి శల్యమవుతున్న భార్యను చూసి ‘దీని అందం ఇంకా పెరుగుతోందే. అయినా నాకు భయపడి వెధవ్వేషాలు ఏమీ వెయ్యదులే. ఏదో ఆ రామనాథంగాడు చెప్పబట్టి, ఈమాత్రం కంట్రోల్లో వుంచుకొన్నాను’ అని తనను తను మెచ్చుకుంటూ, తాగుతూ, తిరుగుతూ, రమ్యను హింసిస్తూ ఇంకో రెండు సంవత్సరాలు గడిపాడు. తాగుడు ఎక్కువై, ఆఫీసుకి తాగి వెళ్ళడం, ఆఫీసు డబ్బు కొంత సొంత ఖర్చుకి వాడుకోవడంతో ఉన్న ఉద్యోగం కూడా ఊడింది. తన ఖర్చులకి కూడా రమ్యమీద ఆధారపడి, ఇంకొంచెం ఎక్కువగా కొట్టడం మొదలుపెట్టాడు.

సడన్‌గా ఒకరోజు ట్రాన్స్‌ఫర్ వచ్చిందని, వేరే ఊర్లో వెంటనే జాయిన్ అవ్వాలని, పిల్లలతో సహా బయలుదేరింది రమ్య. వెళ్ళగానే డబ్బు పంపిస్తానని, ఇక్కడ అన్నీ సెటిల్ చేసేసి సామాన్లు తీసుకురమ్మని చెబుతూ “కొంత డబ్బు చేతిఖర్చుకి ఉంచండి” అంటూ వెళ్ళింది.

వెళ్ళి 15 రోజులు గడుస్తున్నా రమ్య ఉత్తరం రాయలేదు. మత్తులో వుండి ఏ ఊరో అడగలేదు. అయినా అది ఎక్కడికి పోతుంది? ఎవరితో పోతుంది? నాలుగు రోజులు ఓపిక పడదాం. చేతిలో డబ్బులున్నాయిగా అనుకుంటూ కాలం గడపసాగాడు శేషు. సరిగ్గా రమ్య వెళ్ళిన నెల రోజులకి పోస్ట్ అంటూ పోస్ట్‌మాన్ వచ్చి ఇంటిముందు నిలిచాడు. డబ్బు వచ్చి వుంటుందనుకొని, ఆత్రంగా బయటకు వచ్చాడు శేషు.

“ఇదిగో మీ ఉత్తరం” అంటూ చేతిలో పడేసి పోబోయాడు పోస్ట్‌మాన్.

ఉత్తరం ఓ మూలకు విసిరేస్తూ “డబ్బు ఏమీ రాలేదా?” అంటూ పోస్ట్‌మాన్ వెంటబడ్డాడు శేషు.

“వస్తే ఇవ్వనటండీ. మీ చాదస్తంగాని” అంటూ విసుక్కొని వెళ్ళిపోయాడతను.

ఇంట్లో వున్న ఒక్కొక్క సామాను అమ్మేస్తూ, ‘ఈ రమ్య ఎక్కడికి చచ్చిందో!’ అని విసుక్కొంటూ కాలం గడపసాగాడు శేషు.

రమ్య ముందు పనిచేసే బ్యాంకుకి వెళితే-

“నువ్వేం మొగుడివయ్యా! ఆమె ఇక్కడ ఉద్యోగం రిజైన్ చేసి, దాదాపు 2 నెలలవుతోంది. వ్యక్తిగత కారణాలని మానేసింది. నువ్వు తాగి, ఆ అమ్మాయిని తంతావని మాకు తెలుసు. ఆమె ప్రాణం తీసేసి, ఏదైనా నాటకం ఆడుతున్నావా? పోలీసులని పిలవమంటావా?” అని తిరిగి శేషుని వాయించాడు మేనేజర్.

“లేదండీ. ఏదో ఊరు ట్రాన్స్‌ఫర్ అయ్యిందని, పిల్లలను తీసుకొని మరీ వెళ్ళింది. నామీద అలిగి వుంటుంది” అని సర్ది చెప్పి బ్రతుకుజీవుడా అని బయటపడ్డాడు శేషు.

రమ్య వాళ్ళ పుట్టింటికి వెళితే, రెండు నెలల నుండి రమ్య రావటం లేదేమని, తిరిగి వాళ్ళే శేషుని అడిగారు.

నోరు నొక్కుకుని అక్కడి నుండి ఎలాగో బయటపడ్డాడు. తాగిన శరీరం, మత్తులో మునిగిన మనసు ఆలోచించనివ్వటం లేదు. బ్యాంక్ దగ్గర తెలిసిన విషయాలను బట్టి, రమ్య చాలా మంచిదని, తానే అనవసరంగా విసిగించానేమో అని అనుకుంటూ ఇంటికి చేరి తాళం తీశాడు శేషు.

ఎప్పుడో నెలక్రితం మూలకి విసిరికొట్టిన ఉత్తరం వచ్చి కాళ్ళకి అడ్డం పడింది. ఇంతకీ ఈ ఉత్తరం ఎవరిదో అంటూ తెరిచాడు. లోపల చూస్తే అది రమ్య సంతకంతో ఉన్న ఉత్తరం.

శేషూ!

నీకొక పేరు వుంది కాబట్టి సంబోధిస్తున్నాను. ఆ గౌరవానికి నువ్వు ఎంత మాత్రం అర్హుడవు కాదు. నీకు సహనం చాలా తక్కువ అని నాకు తెలుసు. అయినా ఈ ఉత్తరం పూర్తిగా చదువు. లేకపోతే నష్టం నీకే. అనగా—

ఒక్క కాకి వుండేది. మీ రామనాథంలా. అది ఒకరోజు ఒక మర్రిపండును తీసుకువచ్చి ఒక దేవాలయం మీద కూర్చొని తింది. గింజని అక్కడే వదిలిపెట్టింది. అది మాత్రం హాయిగా కడుపునిండిన తృప్తితో, (మావాళ్ళు పెట్టిన భోజనం తృప్తిగా ఆరగించిన మీ స్నేహితుడి లాగా) రెక్కలు ఆడించుకుంటూ ఎగిరిపోయింది. అది విడిచిన గింజమాత్రం ఆ గోడ మీద పగులులోకి జారుకుని, మట్టిలో కూరుకుపోయింది. ఎండకి ఎండి, వర్షానికి తడిసి, మొలకెత్తి, మొక్కైంది. ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో వృక్షమయింది. వేళ్ళు దేవాలయం గోడలంతా విస్తరించాయి. ఊడలు దిగాయి. కొన్ని రోజులకు దేవాలయం కూలిపోయింది. నీ తలలో కూడా నీ స్నేహితుడు, నీ శ్రేయోభిలాషి వేసిన బీజం మహావృక్షమై నిన్ను నిలువెల్లా కూల్చేసింది. నీ అనుమాన రోగంతో నన్ను హింసించావు. పిల్లలను అకారణంగా కొట్టావు. ఉద్యోగినుల మీద, అందమైన ఆడవాళ్ళ మీద ఇన్ని సత్యాలు చెప్పిన ఆ కాకి, తన భార్య నాకన్నా అందమైనదని, నాకన్నా మంచి ఉద్యోగం చేస్తోందని మర్చిపోయింది. నువ్వు కూడా గ్రహించుకోలేకపోయావు. మెల్లిమెల్లిగా నీ ఇన్ఫ్లుయెన్స్ పిల్లల మీద కూడా పడుతుంది. మూడేళ్ళ వాడు అయిన తమ్ముడు అక్కని కొట్టడం మన ఇంట్లోనే జరుగుతోంది. "అక్కని కొట్టడం తప్పుకాదా అంటే నిన్ను నాన్న కొట్టడంలే" అంటూ అడుగుతున్నాడు. నీ ప్రభావంలో పెరగడం కన్నా పిల్లలకి తండ్రి ఛాయ లేకుండా చేయడం ఆరోగ్యకరం అని నిర్ణయించుకున్నాను. మేం చదువుకోవడం, ఉద్యోగం చేయడం. మా వ్యక్తిత్వ వికాసానికి కాకుండా, మీ జల్సా ఖర్చులకి, మీరు పెట్టే హింసని భరించడానికి అయితే అలాంటి పరిస్థితిని ఎదుర్కొనే ఆడపిల్లలందరికీ నేను చూపించే జవాబు ఏమిటో తెలుసా?

మొగుడ్ని వదిలేసి ఉద్యోగం చేసుకోమని.

17 సంవత్సరాల విద్యార్జన, ఆరేళ్ళ ఉద్యోగ విధి, అయిదేళ్ళ దాంపత్య జీవితంలో నేను సాధించింది నీ నిరాదరణ, నీవు వేసే నిందలు. ఇద్దరు పిల్లలు అయితే, ఉద్యోగంలో మాత్రం నా ధర్మం సక్రమంగా నిర్వర్తించినందుకు, నాకు ఓవర్‌సీస్ బ్రాంచ్ కి ప్రమోషన్‌తో పోస్టింగ్ వచ్చింది. నీకు ఈ ఉత్తరం అందేటప్పటికి నేను వేరే దేశంలో వుంటాను. ముందుగా బోంబే వచ్చి, అక్కడి నుండి ఆర్డర్స్ కలెక్ట్ చేసుకోమని నాకు తెలియజేశారు. ఈ స్టేట్ నుండి సెలెక్ట్ అయిన వాళ్ళలో నేను రెండవదాన్ని. నా మెరిట్, నా ర్యాంక్, నా ఉద్యోగ సమయంలో నా రికార్డు వీటన్నింటినీ పరిగణించి నన్ను సెలెక్ట్ చేశారు. ఇదే విషయం నీకు చెబితే నీవు తప్పకుండా ఏ వెధవ పని చేసి ఈ అవకాశం సంపాదించుకున్నానని అంటావని తెలుసు. ఇవన్నీ నీకు చెప్పవలసిన అవసరం నాకు లేదు. కాని నీ పిల్లలని నేను సక్రమమైన ఆర్జనతో పెంచుతున్నానని నీకు తెలియజేయడానికే ఈ ఉత్తరం. నీ పిల్లలు నాలాగా తయారవ్వరు అని చెప్పేవాడివి, నీ రక్తం అని విర్రవీగేవాడివి. ఒక విషయం తెలుసా నీకు, తల్లి మాత్రమే పిల్లలకి నిజం, తండ్రి ఒక నమ్మకం అని. నేను ఎవర్ని చూపిస్తే వాడే నా పిల్లలకి తండ్రి. ప్రతి ఇంట్లోనూ, ప్రతి కుటుంబంలోనూ ఇదే పద్ధతి. అయినా నీ మనశ్శాంతి కోసం నేను చెబుతున్నాను. నీ పిల్లలు అనుకొంటున్న ఈ పిల్లలు నీ పిల్లలే. నీవు మా గతంలో మనిషివే తప్ప, నీకు మా వర్తమానంలో కాని, భవిష్యత్తులో కాని చోటులేదు. దయచేసి ఇది గుర్తుంచుకొని మెలుగు. నేను నా ఉజ్వల భవిష్యత్తులోకి, నా ఇద్దరి పిల్లలతో సుదూర తీరాలకి వెళుతున్నాను. నన్ను నువ్వు చట్టపరంగా, న్యాయపరంగా ఏమీ చేయలేవు. చదువుకొన్న నేటి, మేటి, ఆడపిల్లగా నా జాగ్రత్తలన్నీ నేను తీసుకొన్నాను. ఇంక సెలవు.

-రమ్య.

ఉత్తరం పూర్తవుతూనే షాక్‌తో నోట మాటరాక కుప్పకూలిపోయాడు శేషు.



శైలజా రాంషా